# కాంప్లెక్స్ కథలు

Presented by
Ghandiketa Brahmaji Rao and
Srimathi Sitarama



## రజకమహాశయుల కాంప్లెక్స్

చాకళ్ళు—తండ్రీ కొడుకులు తమ గాడిదను తోలుకొనిపోతున్నారు.

ఒకడు ఎదురుపడి, "గాడిదమీద ఎవరైనా కూచోకూడదూ?" అని సాగిపోయాడు. తండ్రి కొడుకును గాడిదమీద ఎక్కించాడు. కొంత దూరం సాగాక మరొకడు ఎదురుపడ్డాడు. "పెద్దవాడిని నడిపిస్తూ చిన్నవాడివి గాడిదెక్కి కూచున్నావు—సిగ్గులేదూ?" అని సాగిపోయాడు. తండ్రీకొడుకు లిద్దరూ కూచున్నారు. కొంతదూరం సాగాక మరొకడు ఎదురుపడ్డాడు. "నోరులేని జీవంమీద సిగ్గులేక ఇద్దరూ కూచున్నారా? న్యాయానికి మీరే దాన్ని మొయ్యాలి" అని సాగిపోయాడు. తండ్రీ కొడుకు లిద్దరూ గాడిద కాళ్ళు కట్టి మొయ్య సాగారు. ఒక వంతెన మీదుగా పోతుండగా తన కాళ్ళ బంధాలు భరించలేక గాడిద గిలగిల తన్నుకుని వంతెనక్రింద ప్రవహిస్తోన్న కాలువలోపడి చచ్చిపోయింది.

ఇది సొంత ఆలోచన లేకుండా అందరి విమర్శలకు విలువ నిచ్చే రజక మహాశయుల కాంప్లెక్స్.

* * *

"గురూ! నేను కథ వ్రాయాలనుకుంటున్నాను. దేనిమీద వ్రాయమంటావ్?" పరమ గంభీరంగా ప్రశ్నించాడు పరంధామయ్య. ఆ గాంభీర్యం ఏమాత్రం అర్థంగాక, "నీకు దేనిమీద వ్రాయాలనిపిస్తే అదే వ్రాయి" అన్నాడు రామచంద్రయ్య అతి మామూలుగా.

"బ్రహ్మాండమయిన ప్రేమ కథ వ్రాసేస్తాను బోలెడు సస్పెన్స్‌తో—పాఠకులు డంగైపోవాలి! బాగుండదూ?" కుతూహలంగా ప్రశ్నించాడు పరంధామయ్య.

"బాగా వ్రాస్తే ఎందుకు బాగుండదూ?" అమాయకంగా అన్నాడు రామచంద్రయ్య. అత్యుత్సాహంగా వెళ్ళిపోయిన పరంధామయ్య మహోత్సాహంగా నవల పూర్తిచేసేశాడు.

---

## డా॥ సి. ఆనందారామం

---

"అది మొదటి రాత్రి. కొత్త పెళ్ళికూతురు శోభ-పట్టు చీర, పూల జడ, పాల గ్లాసుతో గదిలోకి వచ్చింది. మోహన్ గాఢమైన ప్రేమతో ఆమెను సమీపించబోయాడు.

"ఆగండి! నా దగ్గరకి రాకండి!" అని గర్జించింది ఆ సుకుమారి.

"ఇదెక్కడి ఘోరం?" అని తలకొట్టుకున్నాడు పెళ్ళికొడుకు.

"నా మెళ్ళో మూడుముళ్ళూ పడిన మరుక్షణమే సునీత మీతో తనకున్న సంబంధమంతా చెప్పేసింది. నేను మిమ్మల్ని క్షమించలేను."

"అన్యాయం! అమానుషం! ఆ సునీత చెప్పిన మాటలన్నీ అబద్ధాలే!"

"నేను నమ్మను—సునీత మాటలు నమ్మి మిమ్మల్ని అపార్థం చేసుకోవటమే నాకు బాగుంటుంది."

ప్రేమ నిగ్రహించుకోలేక శోభను బలవంతంగా ముద్దుపెట్టేసుకున్నాడు మోహన్. అతని చేతుల్లో మూర్ఛపోయింది శోభ.

"శోభా! శోభా!" అని అరుస్తూ, ఆవిడని మంచంమీద పడుకోబెట్టాడు. ముఖంమీద చన్నీళ్ళు జల్లాడు. కళ్ళు తెరిచింది. రోషంతో, "తాళికట్టిన అధికారంతో నా శరీరం స్వాధీనం చేసుకోగలరేమో కాని, నా మనసులో మాత్రం స్థానాన్ని పొందలేరు" అంది.

"శోభా! శోభా! నన్ను క్షమించు. నేను పశువులా ప్రవర్తించాను, నిజమే. కాని, మనసులేనిఆడదాన్ని బలవంతంచేసే పశువును మాత్రం కాను" అన్నాడు మోహన్.



శోభ మనసు కరిగింది. అంతలో కోపమొచ్చింది. ఆ కోపానికి తట్టుకోలేక రోగమొచ్చింది. అప్పుడు మోహన్ కళ్ళలో ప్రాణాలన్నీ పెట్టుకుని, ఆ ప్రాణాలు రెండు జేబుల్లోను వున్న బరువైన పర్సుల్లో

నింపుకొని, శోభకు సకల సేవలూ చేశాడు. ఆ పర్స్వల ప్రేమకు కరిగి, శోభ మోహన్‌ను ప్రేమించబోతుండగా అహల్య వచ్చింది "మోహన్!" అంటూ.

అక్కడితో కథ మొదటికొచ్చింది, ముందుకు సాగలేక.... ఆ స్తమానం తనే అపార్థం చేసుకోవాలా అని శోభకు విసుగొచ్చే సరికి కృష్ణమూర్తి వచ్చేశాడు, 'నేను ఉన్నాను' అంటూ—అప్పుడు మోహన్ మొదట అపార్థం చేసుకుని తరువాత ఆందోళన అనుభవించి ఆ తరువాత ఉదారంగా, "శోభా! నువ్వు కృష్ణమూర్తిని పెళ్ళి చేసేసుకో!" అనేసాడు. ఆ ఔదార్యానికి కరిగిపోయి, సునీత చచ్చిపోతూ వ్రాసిన పెద్ద ఉత్తరం ద్వారా అసలు విషయాలన్నీ తెలుసుకుని, "మోహన్!" అని వాలిపోయింది శోభ...."

ఈ నవల వ్రాసిన కొద్దిరోజుల్లోనే ముఖం వేలాడేసుకుని వచ్చాడు పరంధామయ్య—"లాభం లేదు గురూ! హాట్ కేక్స్‌లా అమ్ముడు పోతాయనుకున్న పుస్తకాలు ఒక్కటైనా అమ్ముడు పోలేదు. విమర్శకులూ తిట్టి పోసారు, పాఠకులూ విసిరి పారేసారు."

"నువ్వు సృష్టించిన సస్పెన్స్‌కి పాఠకులు అక్షరాలా దంగై పోయారన్న మాట!" నవ్వాడు రామచంద్రయ్య.

"ఇది లాభం లేదు గురూ! ఈ రోజుల్లో పాఠకులకి ప్రేమ కథల కంటే కూడా అమ్మలక్కల కబుర్లలాంటి నవలలంటేనే ఇష్టంలా ఉంది. అలాంటిదే వ్రాసి పారేస్తాను. అదే బెస్ట్ కదూ!"

"నువ్వు మనసారా ఏది బెస్ట్ అనుకుంటే, అదే బెస్ట్."

"ఇక చూసుకో నా తడాఖా!" అంటూ ఝామ్మని వెళ్ళి పోయాడు పరంధామయ్య.

నిద్ర హారాలు మాని నవల పూర్తి చేశాడు.

"సరిహద్దు గోడవారకి బించె బోర్లించి దాని మీదికెక్కి,

"సోవమ్మొదినా!" అని కేకేపింది రావమ్మ. ఉల్లిపాయిలు వేయిస్తూన్న సోవమ్మ గభాలున స్టౌ ఆర్పేసి, దొడ్లోకి పరుగెత్తుకొచ్చి గోడవారగా ఓ ఇటికెట్ టోర్లించి దానిమీదకెక్కి, "ఏవిటి రావమ్మొదినా? ఏమిటి సంగతులు?" అంది.

"ఇది విన్నావా? ఆ అలమేలు మంగమ్మ, తన కూతురికి పెళ్ళి చేసేపింది."

"నిజంగా! దాన్నెవడు చేసుకున్నాడే?"



"అదే ఆశ్చర్యం! ఆ రామయ్యతో సంబంధం ఉందంటారు. అనకూడదు కానీ, ఆ వెంకటయ్యిని కూడా ఇది మరిగిందట! - మనకు తెలిపి ఇన్ని. మనకు తెలియకుండా ఇంకెన్ని ఉన్నాయో!"

"వదినా! నేనసలు అనవసరంగా ఇంకోళ్ళ విషయాల్లో కలిగించుకునేదాన్ని కాను గాని, మనలో మనమాట - ఆ మంగమ్మ

కూతురు ఈ మధ్య సంగీతం నేర్చుకుంటోంది కదా, ఆ సంగీతం మాస్టారితో కూడా ఏదో ఉండదంటావా?''

"ఎందుకుండదొదినా? నీ కింకా సందేహమా? తప్పకుండా ఏదో ఉండే ఉంటుంది.''

"ఆ మంగమ్మకి అల్లుళ్ళని పట్టడంలో భలే చాతుర్యం! ఈ అల్లుణ్ణి ఎలా బుట్టలో వేసుకుందంటే...."

* * *

పేజీలు ఎలా కదులుతున్నాయో కూడా తెలియకుండా ఉద్గ్రంథం తయారయి పోయింది పరంధామయ్యకి - నాలుగు రోజుల్లోనే ఏడుపు మొహంతో వచ్చాడు రామచంద్రయ్య దగ్గిరకి.

"ఈ పాఠకులు నాకేం అర్థం కావటం లేదు గురూ! అమ్మ లక్కాల కబుర్ల లాంటి నవల లంటే మోజు పడుతున్నారు గదా అని అలాంటివే వ్రాస్తే, ఏకగ్రీవంగా "ఛీ! ఛీ!" అంటున్నారు, ''నాకేం తోచదు. నేను ఏదైనా చదువుతాను -" అనే పాఠకులు బహు కొద్ది మంది తప్ప....''

"నువ్వు బెస్ట్‌గా వ్రాయలనుకుంటే, అదిలా బర్స్ట్ అయి పోయిందన్నమాట!" అన్నాడు రామచంద్రయ్య.

"ఇదంతా లాభం లేదు గురూ! సినిమాకు పనికొచ్చే కథ వ్రాసెయ్యాలి! ఒకటి రెండు సినిమాలొస్తే, అప్పుడు చచ్చినట్లు పేరొస్తుంది. ఏం? నా నవల సినిమాకి పనికి రాదంటావా?''

"ప్రొడ్యూసర్‌కి నచ్చితే ఎందుకు పనికి రాదు?''

"సరే! నీకు ఫ్రీ పాస్ ఇప్పిస్తాలే!" అని ప్లాట్ ఆలోచించు కొందుకు వెళ్ళి పోయాడు పరంధామయ్య. చక చక నవల తయారయింది.

"రణధీర వీరాధి వీరుడు, శూరాధి శూరుడు, అతడు నడి రోడ్డున నడుస్తుండగా, కారులో ఒంటరిగా వెళ్తోన్న సుందరాంగిని

ఒక వందమంది రౌడీలు చుట్టు ముట్టి బలాత్కారించబోతే, ఒక్కడే ఆ వందమందినీ తన్ని ఆ సుందరాంగిని కాపాడాడు. అప్పుడు ఎండ పోయి వెన్నెలొస్తే, వెన్నెలెంతో వేడిగా ఉందనుకున్నారు ఆ ఇద్దరూ రాగాలతో. ఆ పిల్ల తండ్రి జమీందారు. తన కూతుర్ని చిన్నప్పుడు తప్పిపోయిన మేనల్లుడికి తప్ప మరెవరికీ ఇవ్వనంటాడు. ఆ సుందరాంగి హోరు హోరున ఏడుస్తూంది - ఆ తండ్రి గుండె కరగదు.

అంతలో విలన్ "నేనే మేనల్లుణ్ణి" అంటూ సుందరాంగి తండ్రి దగ్గిర కొస్తాడు - "బాబూ! ఈ ఆస్తి, ఈ మేడలూ, ఈ కారు, ఈ పిల్లా, అన్నీ నీవే!'' అంటాడు తండ్రి. విలన్ సుందరాంగిని అండర్ గ్రౌండ్‌లో ఒక భయంకర గుహలోకి తీసుకుపోతాడు. అప్పుడు రణధీర్ గెడ్డాలూ, మీసాలతో వచ్చి పారశీక భాషలో (?) మాట్లాడి అందరినీ బెదరగొట్టి అరగంట యుద్ధం చేస్తాడు. సుందరాంగిని కాపాడతాడు. సుందరాంగి తండ్రి ముగ్ధుడై పోతాడు. అన్నట్లు అప్పటికి ఇతడే తన మేనల్లుడని ఆ తండ్రికి తెలుస్తుంది. వైభవంగా సుందరాంగిని రణధీర్‌కిచ్చి పెళ్ళి చేస్తాడు."

ఈ సారి తలకు కట్టుకట్టుకొని మరీ వచ్చాడు పరంధామయ్య.

"నా కర్మ! ఈ వెధవ సినిమా కథల జోలికి పోక పోయినా బాగుండేది!" అన్నాడు ఏడుపు గొంతుకతో.

"అలాంటి కథలు సినిమాలుగా తీస్తున్నారనీ, అలాంటి కథలు వ్రాసే రచయితలకు బోలెడు పాప్యులారిటీ వస్తోందనీ, ఆశ పడి అలాంటి కథ వ్రాస్తే-"

మాట పూర్తి చెయ్యలేక ఏడ్చేసాడు పరంధామయ్య.

"ఏం జరిగింది?" అని రామచంద్రయ్య అడక్కుండానే సర్దుకుని చెప్పటం ప్రారంభించాడు.

"ఈ నవల కూడా పాఠకుల్లో ఒక్కరూ ముట్టుకో లేదు— పోనీలే-ముందు సినిమాగా వస్తే, ఆ తరువాత పాఠకులు చదువు

తారు- అనుకుని, నేనే నా నవల ప్రొడ్యూసర్ దగ్గరకు తీసికెళ్ళాను. ఆ ప్రొడ్యూసర్ నా నవల చక చక చదివేసి చడామడా తిట్టేసాడు. "నేనూ, మా డైరెక్టర్‌గారూ, మా హీరోగారూ కలిపి వారం రోజులు అహోరాత్రులూ తపసు చేసి అల్లుకున్న కథ ఇది. అప్పుడే మేము షూటింగ్ కూడా ప్రారంభించాం. మా ఐడియా ఎలాగో కొట్టేసి నువ్వు నవలగీసి పారేసావ్! నేను నీ మీద కేస్ పెట్టగలను" అన్నాడు.

ఆ దెబ్బకు హడిలి పోయి, "బాబ్బాబు! నా మీద కేస్ పెట్ట కండి. నా నవలలో సన్నివేశాలు ఏవేవి ఎలా ఎలా కావాలంటే అలా అలా ఉపయోగించుకోండి." అని బయట పడ్డాను. ఆ ప్రొడ్యూసర్ పెట్టిన చీవాట్లకు తల వాచిపోగా కట్టుకట్టు కున్నాను-"

రామచంద్రయ్య పక పక నవ్వుతూ, "భేష్! నవల సినిమాగా తియ్యక పోతే పీడా పోయింది కాని, ఒక సినిమా అంత అనుభవాన్ని ఆనందించి వచ్చావ్!" అన్నాడు.

పరంధామయ్య రోష పరవశుడై వీరావేశంతో లేచి, "ఇక ముందు ఇలాంటి అల్లాటప్పా కథలు వ్రాయను - రాజకీయ చైతన్యాన్ని ప్రబోధిస్తూ వ్రాసేస్తాను -" అని వెళ్ళి పోయాడు.

కొంత ప్రయాస పడ్డా, నవల పూర్తి చేసాడు.

"శ్యామ్, సలితకు ఒక్కగా నొక్క కుమారుడు. తండ్రి వీర వరదయ్య కారణంగా తల్లికి దూరమయ్యాడు, చివరకు ఎలాగో తల్లిని కలుసుకో గలిగాడు. "అమ్మా!" "బాబూ!" "అమ్మా!" "బాబూ!"—అని ఆ తల్లీ బిడ్డలు ఆనందాశ్రువులతో ఆలింగనం చేసుకున్నారు,

"అమ్మా! నిన్ను నాకు దూరం చేసిన ఈ వీరవరదయ్యను బ్రతకనియ్యను." అన్నాడు శ్యామ్. "బాబూ! నా మాంగల్యం కాపాడు, నా పసుపు కుంకుమ నిలబెట్టు!" అని కన్నీటితో అర్థించింది తల్లి. తల్లి మాట కాదన లేక పోయాడు. తండ్రిని క్షమించ లేక పోయాడు. విరక్తితో ఇల్లు వదిలి వెళ్ళి పోయాడు. కొండల్లో

గుట్టల్లో, శ్యామ్ గుర్రం, 'టక-టక'మని విప్లవ గీతానికి లయగా అడుగులు వేస్తూ, కదను తొక్కుతోంది. ఆ కొండ కోనల్లో ఎవరు? హరిజనులు! గిరిజనులు!

తేవాలి తుపాకులు!

రావాలి విప్లవం!

రగలాలి గుండెలు!

ఎగరాలి తలలు!

కొద్ది రోజుల్లోనే గడ గడ వణికిపోతూ వచ్చాడు పరంధామయ్య.

"గురూ! ఇక చచ్చినా విప్లవాన్ని సమర్థించను. నేను అంత విప్లవాన్ని ప్రబోధిస్తే, నన్ను మెచ్చుకోవటానికి మారుగా, "నీ శుద్ధ మొద్దు వ్రాతలతో మా ఉద్యమాన్ని వెక్కిరిస్తావా?" అని తన్నటానికి వచ్చారు.

జేబులోంచి రుమాలు తీసుకుని ముఖానికి పట్టిన చమట తుడుచుకున్నాడు పరంధామయ్య.

రామచంద్రయ్య ఇచ్చిన కాఫీతాగి, కుదుట పడ్డాక స్థిమితంగా అడిగాడు—

"అవును గానీ రామచంద్రయ్యా! నేను ప్రేమకథలు వ్రాసినా పాఠకులు మెచ్చుకో లేదు. అమ్మలక్కల కబుర్లూ, సినిమా కథలూ, విప్లవ ప్రబోధాలూ - ఏది వ్రాసినా, "ఛీ! ఛీ!" అనే అన్నారు. ఎందుకని? అసలేం కావాలి ఈ పాఠకులకి?"

ఇన్నాళ్ళ కయినా తను చెప్పేది వినదగిన స్థితిలోకి పరంధామయ్య వచ్చినందుకు సంతోషించాడు రామచంద్రయ్య.

"పరంధామయ్యా! ఎవరు ఏది మెచ్చుకుంటారో, ఎవరు దేనిని విమర్శిస్తారో - అనుకుంటూ వ్రాసినంత కాలం నువ్వేం వ్రాస్తావయ్యా?

"నీ కళ్ళతో నువ్వు జీవితాన్ని చూడు. నీ అనుభూతుల్ని నీ గుండె లోతుల్నుంచి పర్యాలోచించి చూసుకో! నీ మేధతో ఆ ఆలోచనలు జీవితంలో అన్వయించుకో! అప్పుడు చెప్పదగినది నీకే దైనా కనిపిస్తే చెప్పు—అదీ రచన—అది ప్రేమకథైనా, కాకమ్మ కథైనా, మరే కథైనా పరవాలేదు. నువ్వు చూపిన జీవితాన్ని, అందులో చూడగలిగితే అది పాఠకులను ఆకర్షిస్తుంది, ఆలోచింప చేస్తుంది - అప్పుడు కొందరు అవునంటారు, మరి కొందరు కాదం టారు. కొందరు ప్రశంసిస్తారు, మరి కొందరు విమర్శిస్తారు. ఎవరేమన్నా అది సాహిత్యం—"



"ఒస్! ఇంతేనా? ఈసారి చూడు ఎలా వ్రాసేస్తానో!" సంబ రంగా వెళ్ళి పోయాడు పరంధామయ్య. ఉస్సురని నిట్టూర్చాడు రామచంద్రయ్య. *